క్లుప్తంగా

3 నుంచి గొల్లపుంత సత్తెమ్మ ఉత్సవాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మండపేట: పట్టణంలోని గొల్లపుంత కాలనీలోని వరాల సత్తెమ్మ తల్లి 8వ వార్షిక ఉత్సవాలు ఈనెల 3వ తేదీ నుంచి మూడు రోజులు పాటు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. నూతనంగా ఏర్పడిన గొల్లపుంత కాలనీలో సత్తెమ్మ తల్లి గ్రామ దేవతగా పూజలందుకుంటోంది. 5న అమ్మవారి తీర్థమహోత్సవం, నైవేద్యాల సమర్పణ నిర్వహిస్తామన్నారు.

ఇత్తడి కిరీటం సమర్పణ

కాలనీకి చెందిన అడపా శ్రీనివాసరావు, పుష్ప దంపతులు బుధవారం రూ.7,500 విలువైన ఇత్తడి కిరీటాన్ని అమ్మవారికి సమర్పించారు. తొలుత ఆలయంలో పూజలు నిర్వహించారు. యాదగని చంటి, వెంకట్రావు, గాజుల శ్రీను పాల్గొన్నారు.

రైతులందరి వేలిముద్రలు తప్పనిసరి



కాజులూరు ఆర్‌బీకేలో ఈ-కేవైసీ వేస్తున్న రైతులు

కాజులూరు: గ్రామాల్లో దాళ్వా పంట సాగుచేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా పంటల నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో జరుగుతున్న ఈ-కేవైసీ కేంద్రాలను ఏఓ అశోక్ సందర్శించారు. కాజులూరులో ఆయన మాట్లాడుతూ మండల గ్రామాల్లో 19,500 ఎకరాల సాగుభూమికి గానూ 17 వేల మంది రైతు ఖాతాలు ఉన్నాయన్నారు. వీరందరూ తప్పనిసరిగా ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించి ఈ క్రాప్ బుకింగ్ చేయించుకుని వేలిముద్రలు వేయాలన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వం నుంచి వచ్చే పథకాల్లో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు.

నేడు కాలేరులో గడప గడపకూ..

కపిలేశ్వరపురం: మండలంలోని కాలేరులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గ్రామంలో పర్యటిస్తారని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు గ్రామ పర్యటన ప్రారంభమవుతుందని, ప్రభుత్వ శాఖల అధికారులు ఎమ్మెల్సీ తోట వెంట అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

మంచి అలవాట్లు ఉజ్వల భవితకు పునాది

కపిలేశ్వరపురం: విద్యార్థి దశలో అలవర్చుకున్న మంచి అలవాట్లతో ఉజ్వల భవిష్యత్తుకు పునాది పడుతుందని మహిళా పోలీస్ మహ్మద్ షైనాజ్ అన్నారు. కేదారిలంక గ్రామ శివారు వీధివారి లంక ఎంపీపీ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో బుధవారం ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు విద్యార్థుల్లో సామాజిక చైతన్యం పెంపొందించే దిశగా షైనాజ్ అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులను గుర్తించేందుకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశంపై, ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ నియమ నిబంధనలు, పోషకాహార ప్రాధాన్యత తదితర అంశాలపై విద్యార్థులకు ఆమె అవగాహన కల్పించారు.

జీవితబీమాను సద్వినియోగం చేసుకోవాలి



జీవిత బీమాపై ర్యాలీ చేస్తున్న తపాలా ఉద్యోగులు

రామచంద్రపురం: తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ అందించే భారత ప్రభుత్వ తపాలా జీవిత భీమాను సద్వినియోగం చేసుకోవాలని హెడ్ పోస్టుమాస్టర్ విఠల్‌నాథ్ అన్నారు. తపాలా జీవిత భీమా దినోత్సవాన్ని స్థానిక ప్రధాన కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించారు. తపాలా జీవిత భీమాపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

7న శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

కె.గంగవరం: ఈ నెల 7న మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ జె.రామలింగేశ్వరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోటిపల్లిలోని ఛాయా సోమేశ్వరస్వామి ఆలయానికి ఏటా లక్షమంది కిపైగా భక్తులు స్వామి దర్శనానికి వస్తారని భక్తుల సౌకర్యార్థం చేయాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో రామచంద్రపురం ఆర్డీఓ సింధు సుబ్రహ్మణ్యం సమీక్ష నిర్వహిస్తారన్నారు. ఆలయం వద్ద ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి సంబంధిత అధికారులు పూర్తి నివేదికతో హాజరు కావాలని ఈవో విజ్ఞప్తి చేశారు.



405 కేజీల లడ్డూతో కంచర్ల చక్రి



ప్రసాద్ దంపతులు సిద్ధం చేసిన స్వామి కల్యాణం బొండాలు



కల్యాణమూర్తుల గ్రామోత్సవంలో పాల్గొన్న మంత్రి వేణు, వరలక్ష్మి దంపతులు

కన్నుల పండువగా కల్యాణోత్సవం

- ఒకే వేదికపై ముగ్గురు దేవుళ్లకు కల్యాణం
- వైభవంగా గ్రామోత్సవం
- ఆలయంలో విశేషపూజలు

రామచంద్రపురం రూరల్: పంచారామ క్షేత్రాల్లో ఒకటిగా వెలుగొందుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామివారి కల్యాణం బుధవారం మృగశిరా నక్షత్రయుక్త మీనలగ్నంలో కన్నుల పండువగా జరిపించారు. కల్యాణాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6.15 గంటలకు మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, చండికాదేవి సమేత సూర్యేశ్వరుడు, లక్ష్మీదేవి సమేత నారాయణ స్వామివార్లను కల్యాణ మూర్తులను గావించి పెండ్లి కుమార మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముత్తైదువలు ఆలయంలో కుంకుమ, పసుపు కొమ్ములను కొట్టి అమ్మవార్లు, స్వామివార్ల కల్యాణాన్ని ప్రారంభించారు. ఉదయం 8 గంటలకు పారిశ్రామికవేత్త, దాత సత్తి సుబ్బారెడ్డి, కుమారులు సూర్యనారాయణరెడ్డి, సత్తిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో లక్షరుద్రాక్ష పూజ నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి కాలార్చన, రాజభోగ నివేదన నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు భక్తులతో విశేషపూజలు నిర్వహించారు. స్వామివార్లను నంది వాహనంపై సాయంత్రం 5 గంటలకు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వరలక్ష్మి దంపతులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా బ్యాండు మేళాలు, బాణసంచాలతో గ్రామోత్సవం జరిగింది. రాత్రి శుభ ముహూర్తం 10.25 గంటలకు ముగ్గురు దేవుళ్లకు కన్నులపండువగా వేద మంత్రోచ్చారణల నడుమ కల్యాణం తంతు నిర్వహించారు.

భీమేశ్వరుని కల్యాణానికి 405 కేజీల లడ్డూ బహూకరణ

దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి కల్యాణానికి ద్రాక్షారామకు చెందిన లక్ష్మీప్రసన్న స్వీట్స్ అధినేత కంచర్ల చక్రధరరావు(చక్రి) 405 కేజీల మిఠాయి లడ్డూ తయారు చేసి అందజేశారు. క్షేత్ర పాలకులైన లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామి వార్లకు చెరో 11 కేజీల లడ్డూలను అందజేశారు. 17 ఏళ్ల క్రితం 3 కేజీల లడ్డూతో ప్రారంభించి ప్రతీ సంవత్సరం పెంచుకుంటూ ప్రస్తుతం 405 కేజీల లడ్డూను అందజేశారు.

కొబ్బరి బొండాలు సమర్పణ..

ద్రాక్షారామకు చెందిన ప్రగళ్లపాటి మల్లికార్జున ప్రసాద్, లక్ష్మీరాజ్యం దంపతులు గత 11 సంవత్సరాలుగా మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి కల్యాణానికి కల్యాణం కొబ్బరి బొండాలు సర్వాంగ సుందరంగా అలంకరించి అందజేస్తున్నారు. ఏటా వినూత్నంగా అలంకరించి అందజేయడం ఆ భార్యాభర్తలు ఆనవాయితీగా పెట్టుకున్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

రామచంద్రపురం రూరల్: మండలంలోని వేగాయమ్మపేటలో శ్రీరామ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయస్వామివార్ల విగ్రహాల పునః ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం శాస్త్రోక్తంగా వైభవంగా నిర్వహించారు. గోపూజ, హోమాలు, శాంతి కల్యాణం, మహాన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, ఎంపీపీ అంబటి భవాని, సర్పంచ్ అంబటి తుకారం, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, కె.గంగవరం ఎంపీపీ పంపన నాగమణి, గ్రామ పెద్దలు కుడుపూడి పెద్దరాముడు, పితాని సూరిబాబు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ మంగతాయారు, సర్పంచ్ ఆరిఫ్

రాయవరం: జిల్లా పరిషత్ యాజమాన్యం అందించిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని రాయవరం జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారువెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని సోమేశ్వరం, మాచవరం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో బుధవారం పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఖర్చుకు వెనుకాడకుండా విద్యాభివృద్ధే లక్ష్యంగా జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ స్టడీ మెటీరియల్‌ను పాఠశాలలకు పంపిణీ చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని అన్నారు. స్టడీ మెటీరియల్ పంపిణీలో సోమేశ్వరం సర్పంచ్ ఆరిఫ్, పీఎంసీ చైర్మన్లు గరగ దుర్గా ప్రసాద్, వెలగల అచ్యుత రామారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు ధూళిపూడి వెంకటేశ్వరరావు, మేడపాటి వరప్రసాద్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎంలు ఆర్.దయామణి, జగన్మోహిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

పాడి రైతులకు అండగా ప్రత్యేక చర్యలు



రామచంద్రపురంలో వైఎస్సార్ పశు సంచార వైద్య వాహనాన్ని ప్రారంభించిన మంత్రి వేణు



కపిలేశ్వరపురంలో సంచార పశు వైద్యశాల వాహనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

రామచంద్రపురం: వ్యవసాయంతో పాటు రైతులకు మంచి లాభాలను అందించే పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ రైతులకు అండగా ఉంటుందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం వద్ద బుధవారం డాక్టర్ వైఎస్సార్ పశు సంచార వైద్య వాహనాన్ని జెండా ఊపి మంత్రి వేణు ప్రారంభించారు. మంత్రి వేణు మాట్లాడుతూ గ్రామాల్లోని పశువులకు మెరుగైన వైద్యాన్ని అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం సంచార వైద్య వాహనాలను తీసుకువచ్చిందన్నారు. పశువులకు సీజనల్‌గా వ్యాపించే వ్యాధులకు అరికట్టేందుకు గ్రామాల్లోనే పశువుల శాల వద్దనే వైద్యం అందిస్తూ పశువులను కాపాడుతూ పశుగణాభివృద్ధికి సాధించే దిశగా ఈ వాహనాలు సేవలను అందిస్తాయని మంత్రి వేణు అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, పట్టణ పార్టీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పశుసంవర్థక శాఖ అధికారులు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సంచార వాహనంతో పశు ఆరోగ్య సంరక్షణ

కపిలేశ్వరపురం: మూగ జీవాల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన సంచార పశు వైద్యశాల వాహనం పశువుల ఆరోగ్య సంరక్షణ ఎంతగానో దోహదపడుతుందని జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అన్నారు. పశుసంవర్థక శాఖ ఆలమూరు సహాయ సంచాలకులు ఎల్.అనిత పర్యవేక్షణలో మండల పశువైద్యాధికారిణి సీహెచ్.ఇందుప్రియ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వాహనాన్ని జెడ్పీటీసీ, ఎంపీపీ ప్రారంభించారు. ఏడీ ఎల్.అనిత మాట్లాడుతూ పశువులు అనారోగ్యానికి గురైన వెంటనే 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయగానే సమీపంలోని రైతు భరోసా కేంద్రానికి సమాచారం అందుతుందన్నారు. వెంటనే పాడి రైతుల వద్దకే వాహనంలో వచ్చి వైద్య సేవలందిస్తామన్నారు. జెడ్పీటీసీ, ఎంపీపీ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ పేరుతో మంజూరైన వాహనాన్ని కపిలేశ్వరపురం మండలానికి కేటాయించడంపై ప్రభుత్వానికి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యులు ఇందుప్రియ, రమణమూర్తి, సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీలు అడ్డాల శ్రీనివాస్, పెద్దిరెడ్డి శేషారత్నం, పలివెల మధు, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు తమ్మన నాగబాబు, వాసంశెట్టి వాసు, పాలింగి కిశోర్, శ్రీను పాల్గొన్నారు.

రామచంద్రుడు కాలువకు శాశ్వత పరిష్కారం చూపండి



పూడికతీత పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, చైర్‌పర్సన్ దుర్గారాణి

- అధికారులకు ఎమ్మెల్సీ తోట ఆదేశం

మండపేట: పట్టణంలో దీర్ఘకాలంగా రైతులను పట్టి పీడిస్తున్న రామచంద్రుడు పంటకాలువ పూడిక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పూడిక వల్ల పొలాలకు సాగునీరందక రైతులు ఇబ్బంది పడుతుండటంపై వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ తోట సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టిన విషయం విదితమే. పూడికతీత పనులను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబుతో కలిసి ఎమ్మెల్సీ తోట పరిశీలించారు. సమస్యపై రైతులతో మాట్లాడారు. పట్టణంలో వాడకం నీరు, ప్లాస్టిక్, గాజు వ్యర్థాలు రామచంద్రుడు పంటకాలువలోకి చేరి కాలువ పూడిక పేరుకుపోయింద. దీంతో ఏటా శివారు భూములకు సాగునీటి ఎద్దడి ఎదురై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ ఎగువన ఇరిగేషన్ అధికారులు సకాలంలో పూడిక తొలగింపు పనులు చేపట్టడం లేదన్నారు. సమస్యపై ఎమ్మెల్సీ తోట మున్సిపల్ కమిషనర్ టి. రామ్‌కుమార్, ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. పట్టణంలో వాడకం నీరు, వ్యర్థాలు పంటకాలువలోకి రాకుండా శాశ్వత పరిష్కారం చూపేందుకు వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇరిగేషన్ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కాలువ ఎగువ ప్రాంతంలో పూడిక సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నేత కొమ్ము రాంబాబు, జొన్నపల్లి సత్తిబాబు, అడబాల వీరబాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కోడిపందేలు



కాజులూరు మండలం గొల్లపాలెంలో కాలుదువ్వుతున్న పందెం కోళ్లు

కాజులూరు: సంక్రాంతి పండగ వచ్చిందంటే ఉభయగోదావరి జిల్లాల్లో కోడి పందేలు జోరుగా సాగుతుంటాయి. గ్రామాల్లో కోడి పందేల నిర్వహణకు అనుమతులు ఇవ్వవద్దని ఎక్కడ నిర్వహించినా కఠినచర్యలు తీసుకోవాలని కోర్టులు పోలీసులకు ఆదేశాలు జారీ చేస్తున్నాయి. అయినప్పటికీ పండగ రోజులో పోలీసులు కాస్త చూసీచూడనట్టు ఉండటంతో ఆ మూడు రోజులు పందాలకు అడ్డూ అదుపూ లేకుండా సాగిపోతున్నాయి. అయితే సంక్రాంతి పండగ అనంతరం జిల్లాలో కోడిపందేల నిర్వహణ తగ్గుముఖం పడుతున్నప్పటికీ రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు, కె.గంగవరం మండలాల్లో మాత్రం పందేలు యథావిధిగా జరుగుతున్నాయి. కాజులూరు మండలంలో గొల్లపాలెం, ఆర్యావటం, కాజులూరు, కుయ్యేరు, కోలంక, కె.గంగవరం మండలం మసకపల్లి, పేకేరు తదితర గ్రామాల్లో పొలాల మధ్య దిమ్మలపై జూదరులు యథేచ్ఛగా కోడిపందేలు నిర్వహిస్తున్నారు. సంక్రాంతి అనంతరం కోడి పందేలను నిరోధించడంపై పోలీసులు అంతగా దృష్టి పెట్టడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. సంక్రాంతి ముగిసిన రెండు రోజుల అనంతరం మండలంలోని నామవానిపాలెంలో కోడిపందేలు నిర్వహిస్తుండగా పోలీసులు దాడులు చేసి ముగురిని అరెస్టు చేశారు. పందేల స్థావరాల్లో పందాలతో పాటు గుండాట, పేకాట తదితర జూదాలు నిర్వహిస్తున్నారని దీంతో రూ.వేలు చేతులు మారుతుండగా పలువురు అమాయకులు సర్వం ఒడ్డి నష్టపోతున్నారన్నారని స్థానికులు చెబుతున్నారు. కోడి పందేల కోసం సొమ్ములతో పాటు ఆస్తిపాస్తులు, భార్యల పుస్తెలు పణంగా పెడుతున్న వారు ఉన్నారు. ఈ కోడిపందేల్లో తరచూ ఘర్షణలు చోటుచేసుకుంటుండడంతో గ్రామాల్లో వర్గవిభేదాలు తలెత్తుతున్నాయి. కోడి పందేలు జరగకుండా పోలీసులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మండల గ్రామాల ప్రజలు, మహిళలు కోరుతున్నారు.

90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి



గొల్లపాలెంలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్



చెల్లూరులో వృద్ధురాలికి పింఛన్ ఇస్తున్న వలంటీర్

కాజులూరు: మండలంలోని గ్రామాల్లో వలంటీర్లు శుక్రవారం 90 శాతం వైఎస్సార్ పింఛన్ పంపిణీ పూర్తి చేసినట్టు ఎంపీడీవో ఇందిరాదేవి తెలిపారు. మండలంలో మొత్తం పింఛన్‌దారుల్లో తొలిరోజే వలంటీర్లు సుమారు 90 శాతం పింఛన్లు పంపిణీ చేశారన్నారు. మిగిలిన వారికి ఐదో తేదీలోపు పంపిణీ పూర్తి చేస్తారన్నారు.

82 శాతం పింఛన్ల పంపిణీ

రాయవరం: తెల్లవారుతుండగానే వైఎస్సార్ పింఛన్ కానుకను వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేశారు. కేవలం పింఛన్ మీదనే ఆధారపడి జీవితాన్ని వెళ్లదీస్తున్న వారికి ప్రతినెలా అందే పింఛన్ వారిని జీవితాలకు భరోసాతోపాటుగా ధైర్యాన్నిస్తోంది. ఒకటో తేదీ అనగానే ఠంఛన్‌గా పింఛన్ చేతికొస్తుందనే భరోసాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారులకు కల్పించారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని రాయవరం, మండపేట రూరల్, మండపేట అర్బన్, కపిలేశ్వరపురం, రామచంద్రపురం అర్బన్, రామచంద్రపురం రూరల్, కె.గంగవరం మండలాల పరిధిలో డిసెంబరు నెల పింఛన్లు 63,666 మందికి పంపిణీ చేయాల్సి ఉంది. వీరందరికీ రూ.17,32,37,500 అందిచాల్సి ఉంది. అయితే గురువారం సాయంత్రానికి 52,417 మందికి రూ.14,25,64,750 వాలంటీర్లు పంపిణీ చేశారు. క్లస్టర్ పరిధిలోని ఐదు మండలాల పరిధిలో 82 శాతం పింఛన్‌దారులకు తొలిరోజునే పింఛన్లను అందజేశారు. మిగిలిన పింఛన్లను 2,3 తేదీల్లో అందిస్తామని అధికారులు తెలిపారు.

వైభవంగా భీష్మ ఏకాదశి వేడుకలు



పీఠంలో విజయదుర్గా అమ్మవారు

రాయవరం: తండ్రి సుఖం కోరి సింహాసనాన్ని వదులుకుని ఆజన్మ బ్రహ్మచర్యం పాటించిన పురాణ పురుషుడు భీష్ముడని మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) అన్నారు. భీష్మ ఏకాదశి సందర్భంగా బుధవారం పీఠానికి వచ్చిన భక్తులనుద్దేశించి పీఠాధిపతి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. భీష్ముడు అంపశయ్యపై ఉండి విష్ణు సహస్రనామ కీర్తన చేసి స్వామివారికి ఇష్టమైన మాఘశుద్ధ ఏకాదశిని తన పేరిట బహుమానంగా పొందిన పురాణ పురుషుడన్నారు. భీష్మ ఏకాదశి రోజు విష్ణుమూర్తిని కొలవడం వల్ల సకల శుభాలు కలుగుతాయన్నారు. భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని పీఠంలో రజిత విష్ణుమూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. విజయదుర్గా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పీఠానికి వచ్చిన భక్తులకు పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్(బాబి) ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. భీష్మ ఏకాదశిని మండలంలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయాలకు చేరుకుని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సోమేశ్వరం వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. సర్పంచ్ ఆరిఫ్, సొసైటీ అధ్యక్షుడు నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత ధూళిపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భీష్మ ఏకాదశి పూజలు

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో భీష్మ ఏకాదశి సందర్భంగా ఆలయాల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. మండలంలోని కోటిపల్లి, అముజూరు, భట్లపాలిక, కుందూరు, దంగేరు తదితర గ్రామాల్లోని రామాలయాల వద్ద భీష్మ ఏకాదశి సందర్భంగా భజనలు నిర్వహించారు.

ఘనంగా జనార్దనస్వామి రథోత్సవం

మండపేట: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత జనార్ధనస్వామి రథోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ప్రత్యేక పూజలు అనంతరం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి రథోత్సవాన్ని ప్రారంభించారు.

సబ్సిడీ విద్యుత్ అందించాలని వినతి

కె.గంగవరం: తామంతా ఏళ్ల తరబడి ఆక్వాసాగుపై ఆధారపడి జీవిస్తున్నామని సబ్సిడీ విద్యుత్ ఇవ్వకపోవడంతో ఆర్థికంగా నష్టాలు చవిచూడాల్సి వస్తుందని మండల ఆక్వా సంఘం రైతులు బుధవారం విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందించారు. ఆక్వా చెరువులకు సంబంధించిన విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నా ఇప్పటివరకు సబ్సిడీ విద్యుత్ తమకు అందడం లేదని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. గతేడాది నవంబర్‌లో సబ్సిడీ విద్యుత్‌కు నూతనంగా దరఖాస్తు చేసుకున్నా ఇప్పటి వరకు సబ్సిడీ అందలేదని అధికారులు స్పందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

కబేళా చెర వీడిన గోవు.. లోకాన్ని చూసిన దూడ

- కేశవరం గోవధ ఘటనలోని గోవులు మండపేటలో సంరక్షణ
- దాతల సాయంతో గోశాల ఏర్పాటు
- దూడకు జన్మనిచ్చిన ఆవు



మండపేటలోని గోశాల



లేగదూడను ముద్దాడుతున్న తల్లి గోవు

మండపేట: మరికొద్ది క్షణాల్లో కబేళా కత్తికి ఆ గోవు బలయ్యేది. ఈ విషయం తెలుసుకున్న గోసంరక్షణ సమితి సభ్యులు అక్కడకు చేరుకుని కబేళా చెర నుంచి గోవులను విడిపించారు. దాతల సహకారంతో వాటిని మండపేటలో ఏర్పాటు చేసిన గోసంరక్షణశాలకు తరలించారు. వాటిలో ఓ గోవు దూడకు జన్మనివ్వడం గోశాల నిర్వాహకులను ఆనందంలో ముంచెత్తుతోంది. వివరాల్లోకి వెళితే మండలంలోని కేశవరంలో అక్రమ గోవధ జరుగుతోందని సమాచారం అందుకున్న రాజమహేంద్రవరం, కాకినాడకు చెందిన గోసంరక్షణ సమితి సభ్యులు గతేడాది అక్టోబరు 30 తెల్లవారుజామున పోలీస్, రెవెన్యూ సిబ్బందితో కలిసి కబేళాపై దాడి చేశారు. అప్పటికే కబేళా నిర్వాహకులు రెండు గోవులను వధించగా మరో 16 గోవులను వధించేందుకు సిద్ధం చేస్తున్నారు. గోసంరక్షణ సమితి సభ్యులు వాటిని స్వాధీనం చేసుకుని మండపేటలోని పశుసంవర్థక శిక్షణ కేంద్రానికి తరలించారు. వాటిలో ఒక చూడు గోవు ఉంది. గోవుల సంరక్షణకు శిక్షణ కేంద్రం సిబ్బంది చేతులెత్తేయడంతో వాటి బాధ్యతను మండపేట విశ్వహిందూ పరిషత్ తీసుకుంది. సంస్థ సభ్యుడు అయినవిల్లి రుద్రశర్మ, తన సన్నిహితులతో కలిసి స్థానిక గొల్లపుంతకాలనీ రోడ్డులో శ్రీకామేశ్వరీదేవి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గోశాలను ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో మూడు నెలలుగా వాటి సంరక్షణ,పోషణ బాధ్యతలు చేపట్టారు. అంతక్రితం వరకు సరైన ఆహారం లేక బక్కచిక్కి దీనస్థితిలో ఉన్న గోవులు ఆరోగ్యంగా తయారయ్యాయి. రెండు రోజుల క్రితం వీటిలోని ఒక గోవు దూడకు జన్మనిచ్చింది. మరికొన్ని గోవులు చూడుతో ఉన్నాయని తెలిపారు.

దాతలు సహకారం అందించాలి

గోశాల నిర్వహణకు దాతలు ముందుకు రావాలని నిర్వాహకులు కోరుతున్నారు. ప్రస్తుతం గోశాలలో 17 గోవులుండగా వాటి పోషణకు అధిక మొత్తంలో ఖర్చవుతోందన్నారు. ప్రస్తుతం కొందరు దాతలు సహకారం అందిస్తున్నప్పటికీ పశుగ్రాసాలు, దాణాల కోసం మరింత తోడ్పాటు అవసరమన్నారు. గోవుల సంరక్షణకు దాతలు ముందుకు రావాలని వారు కోరారు.

ఘనంగా శ్రీవాసవీ ఫంక్షన్‌హాల్ ప్రారంభం



ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవంలో ఆర్యవైశ్య ప్రముఖులు

మండపేట: మండలంలోని ఏడిద ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీవాసవీ ఫంక్షన్‌హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శివరామసుబ్రహ్మణ్యం, మండపేట, రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్లు పతివాడ దుర్గారాణి, గాదంశెట్టి శ్రీదేవి, పారిశ్రామికవేత్తలు, ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ గ్రామంలో ఫంక్షన్‌హాల్ నిర్మించడంపై ఆర్యవైశ్య సంఘం నాయకులను అభినందించారు. పసుమర్తి నాగబాబు మాట్లాడుతూ దాతల సహకారం రూ. 2.2 కోట్లతో ఆధునిక వసతులతో ఫంక్షన్ హాలును నిర్మించామన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, మండపేట ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి నాగబాబు, పారిశ్రామికవేత్తలు కొనగళ్ల సత్యనారాయణ, మట్టే శ్రీనివాస్, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.